# కూలిజనం

ఈవేళో రేపో కాలవ తెరుస్తారు. తవ్వ ఇంకా పూర్తి కాలేదు. కంట్రాక్టరు కోప్పడతాడు. ఇంకా చిన్న గుంట దగ్గర ఓ వంద గజాల మేర కాలవ తవ్వి గట్టు బాగు చెయ్యాలి. దొరికినంతమంది కూలీలను రాత్రి పోగుజేశాను. పని పూర్తి కాకపోతే కంట్రాక్టు డబ్బు ప్రభుత్వంవారు ఇవ్వరు.

ఎండిన కాలవ నీటికోసం దాహంగా ఉంది. ఇరుగట్లనీ పరువు కొచ్చిన మామిడికాయలు గుత్తులుగా వేళ్లాడుతున్నాయి. అప్పుడే తెల్లవారినా రాబోయే గాడుపు వేడిగా సూచనగా అప్పుడే తగులు తోంది. కాలవ మధ్య నీటి చెలమలో తప్ప కనుచూపు మేరలో నీరు లేదు. అయినా చెట్లు పచ్చగా ఉన్నాయి. దొంగమబ్బులు దూరంగా తూర్పుదిక్కుని విడిపోయి ఎర్రటిపొద్దుకి చోటిస్తున్నాయి. పడమటి గట్టుని ఉంది ఊరు.

నేను గట్టుమీద కూర్చుని నీరసంగా అదుర్దాగా కూలివాళ్లని హెచ్చరిస్తున్నాను. కూలివాళ్లు ఎంత తొందరపెట్టినా మెల్లగానే పారలువేసి తవ్వుతున్నారు. మెల్లగా తట్టలు నింపుతున్నారు. ఆడ కూలీలు మెల్లగా తట్టలు నెత్తిమీద ఎత్తుకుని గట్టు తెగిపోయిన

చోట మట్టి పోస్తున్నారు. ఎండ గొప్పగా దాహంగా పెరుగుతోంది. ప్రకృతి వేగం మందగించిపోతుంది ఆ ఎండలో. గాలి కదలదు. అయినా ఆ ఎండలో భూమి పగిలి మళ్లీ సారవంతంగా అవుతుంది. ఎండ భూమికి దాహాన్ని నేర్పుతుంది. నిస్సారమయిపోయిన భూమికి మళ్లీ ప్రాణం పోస్తుంది. భూమి రాబోయే నీటిని తాగి తాగి ఒక సంవత్సరం మళ్లీ పంట పండిస్తుంది.

కూలివాళ్ల నల్లటి దేహాలమీద చెమట నిగనిగ మెరుస్తోంది. వాళ్ల వంటిమీద కండలకి ఆ తడి ఒక వింత మెరుపు నిచ్చింది. ఆడ, మగ మెల్లగా కబుర్లు చెప్పుకుంటో పని చేస్తున్నారు. బొద్దు మీసాల పెద్దవాడు అందరిలోకీ సోమరిపోతు. అతని పేరు సత్తి రెడ్డి. కాని తెలివయినవాడు. అతని కబుర్లలోపడి అందరూ పని మరిచిపోతారు. పావుగంటకోసారి గునపం పాతుతుంటాడు. కాని మంచి బలమయిన మనిషి. పద్దెనిమిదేళ్ల వయసు పిల్ల అతను తవ్విన మట్టిబెడ్డలు తట్టలో వేసుకుంది. ఒక క్షణం అతని మాటలు వింటో నిలబడింది. తట్ట ఎత్తుకుని వెళ్లిపోయింది. ఆమె పేరు రత్తి తరవాత ముప్ఫయిఏళ్ల పడుచు వచ్చింది. తట్ట కిందకి దింపి అడ్డ పొగపెట్టిన చుట్ట పైకితీసి, మసి రాల్చివేసింది. ఆమె పేరు చెల్లమ్మ.

"యెయ్యి పిల్లా. సూడకు" అన్నాడు సత్తిరెడ్డి.

"నువ్వు పోడు" అంది ఆమె. అతను నవ్వాడు. ఆమె నవ్వింది.

పొద్దు ముదురుతోంది. కూలివాళ్ల సంభాషణ మెల్లని రొదలాగ వినబడుతోంది. పద్దెనిమిదేళ్ల రత్తి కిచకిచ నవ్వుతోంది. ఆమె మొగుడు వయ్యారంగా కుర్రతనపు గర్వంతో తవ్వుతున్నాడు. బూతుపాటలు పాడుతున్నాడు. దగ్గరగా వచ్చిన ఆడవాళ్లతో పరాచకాలాడుతున్నాడు. అతని పేరు ముసలయ్య. ఏభయిఏళ్ల ముసిలివా డొకడున్నాడు. అతని పేరు పద్దాలు. వాళ్ల ఊళ్లో మావుళ్లమ్మ మహాత్మ్య వర్ణిస్తున్నాడు.

ఎండ ముదురుతోంది. నేను కాలువ గట్టునించి లేచి పక్కనే ఉన్న కరణంగారి ఇంటి అరుగుమీద కూర్చున్నాను. తాటాకు చూరు

కింద పెద్ద వరికంకెల గుత్తి వేళ్లాడుతోంది. పిచికలు పక్కని ఏట వాలుగా వాలి గింజలు తింటున్నాయి. అరుగుమీద ఒక మూల ధాన్యపు పురి ఉంది. రెండో పక్కని తెరిపిగా ఉంది. గోడ లేదు. ఆపక్కని చదునయిన కాళ్లీస్థలం. భూమిలోనించి పొగలు లేచి ఎండలో కలిసిపోతున్నాయి. ఆ మెల్లని ఎండకు కళ్లు జిగజిగమంటు న్నాయి. అరుగుముందు చింతచెట్టు కింద ఆవు సగం నిద్రపోతో నిలబడి నెమరువేస్తోంది.

ముసిలి పద్దాలు చెపుతున్నాడు :

"సంబరంనాడు పోతుని బలేత్తారు. మోట కత్తుంది. ఒక్క యేటకి తల తెగిపోవాల. తప్పితే గండ మన్నమాట. నెత్తురంతా పెద్ద మూకుట్లో పడతారు. అమ్మోరు కాల్లకాడెడతారు. ఐదుళ్లోల్లు తాలా లేత్తారు. కరణాలూ మునిసీబులు అంతా వొత్తారు. రేత్తిరంతా సాకళ్లు గుడిసుట్టూ కాపలా కాత్తారు. తెల్లారి పొద్దున్నే తలుపు తీత్తారు. మూకుడంతా కాళీ అయిపోద్ది. అందులో ఆనమాళ్లుంటాయి. నీటిసుక్కలుంటే వోనన్నమాట. నూలుపోగులుంటే, గుడ్డలు సవ కన్నమాట. అంతా రుజువుగా కనమడద్ది."

వయసులో ఉన్న కుర్రవాడు నడ్డికిచుట్టిన గుడ్డ విప్పి తలకి చుట్టాడు. గోచీ సరిచేసుకున్నాడు. మీసాలవాడు చుట్ట ముట్టించి మళ్లీ తవ్వుతున్నాడు. పని అంతకంతకి వడి తగ్గుతోంది. ఎత్తిన గునపం మెల్లగా ఆయాసంగా పట్టుదప్పి, నేలలోకి దిగుతోంది. పొద్దు నడినెత్తికెక్కుతోంది. ఊళ్లో జనసంచారం లేదు. ఎండకి దడిసి ఊరు నిద్రపోతోంది. కాకులు దాహంగా చెట్టుమీదనించి చెట్టుమీదికి ఎగురుతున్నాయి. ఆఖరికి మీసాలవాడు గునపం పాతి మళ్లీ పైకి ఎత్తలేదు. అందరూ పని ఆపారు. గట్టు సగం అయింది. కాలవ రాకుండా ఉండాలిగాని సాయంకాలానికి పని అయి పోతుంది. సత్తిరెడ్డి నూతిదగ్గర ఒళ్లు కడుక్కుంటున్నాడు. రత్తి దగ్గరగా వెళ్లి నీళ్లిమ్మంది. అతడు చేదలో నీళ్లతీసి ఆమె ముఖం మీదికి జిమ్మాడు.

"నచ్చినోడా" అంది రత్తి నరదాగా.

రత్తి మొగుడు గుర్రుగా చూశాడు. సత్తిరెడ్డి నూతినీళ్లు నోట్లో పోసుకున్నాడు.

"ఛూ! ఉప్పునీళ్లేనే" అని చీదరించుకున్నాడు. అందరూ కాలవలో ఉన్న నీటిచెలమ దగ్గరకు పరిగెత్తారు. కొంచెంసేపట్లో చెలమలో నీరంతా కలిగిపోయింది. పద్దాలన్నాడు. అతను మాలవాడు.

"ఏటుండే! కాపులు. నీరల్లా కలిపేత్తే మరి తాగనాకో? కూడి తినాద్దో?"

అందరూ ఒప్పుకుని నీటిని మెల్లగా ఉపయోగించారు. కాని నీరు కలిగిపోయే ఉంది. ముసలయ్య ఆకలిగా అన్నాడు:

"కూడు తినేతలికి తేరుకుంటది." అతను సెట్టిబలిజ. కల్లుగీసే వాళ్ల నిర్లక్ష్యం, ఒడుదుడుకు అతని ముఖంలో ఉన్నాయి. అతని ముఖం చూస్తే చటుకుని అకారణంగా ఎవరిమీదన్నా చెయ్యి వేసుకుంటాడేమో ననిపిస్తుంది. ఒక గిన్నెలోనే రత్తి, అతను తిండి తినడం ప్రారంభించారు. ఉప్పువేసిన గంజీ, అన్నం, కక్కముక్కలు కొరుక్కుని తింటున్నారు. సత్తిరెడ్డి తన మూటలో ఉన్న ఊరగాయ అందరికి కొద్దికొద్దిగా పంచిపెట్టాడు. ఎక్కువభాగం రత్తికిచ్చాడు. చెల్లమ్మ నేను చూశా నన్నట్టుగా చిరునవ్వు నవ్వింది. తనకి అంత ఇవ్వలేదన్న ఈసుకూడా ఉంది ఆ నవ్వులో. ముసలయ్య చెల్లమ్మ వేపు చూసి రత్తివేపు చూశాడు. రత్తి అమాయకంగా విరగబడి నవ్వింది.

చెట్లు అలసటతో నీరసంగా నిలబడి ఆకాశంలోకి చూస్తున్నాయి. లోకం ఏదో చేసిన తప్పుకి శిక్ష అనుభవిస్తున్నట్టు దీనంగా ఉంది. అయినా చెట్లమీద ఆకులు ముదురుతున్నాయి. గోధుమరంగు పొలాల్లో అక్కడక్కడ ముదురు ఆకుమళ్లు పచ్చని తివాసీలలాగ కనబడుతున్నాయి. గాలిలో మెల్లని దాహం ప్రాణుల్ని మత్తులో ముంచుతోంది. కావుమనలేక నోరార్చుకుని కాకులు ఒంటికన్ను చూపులు ఇటూ అటూ చూస్తున్నాయి. నేను అరుగుమీద వాప

మీద వెన్నువాల్చి ఏమీ చూడకుండా చూస్తున్నాను. కూలివాళ్లు తిండి తిని గిన్నెలు మెల్లగా కడుక్కున్నారు. ఆ గిన్నెల్లోనే కొద్దిగా తేరిన నీరు సంతృప్తిగా తాగారు. గట్టుమీద ఉన్న చింతచెట్టు మొదట్లో చుట్టూ కూర్చున్నారు. తలగుడ్డలలో నించీ రొంటినించీ పొగాకుతీసి కొంచెం నీళ్లతో తడిపి చుట్టలు చుట్టుకున్నారు.

నాకు తెలియకుండానే పొద్దు తిరిగింది. కంగారుగా లేచి వాళ్లని హెచ్చరించాను. వాళ్లు తొందరలేని స్థిమితంతో మెల్లగా లేచారు. తలపాగలు చుట్టుకున్నారు. ఆడవాళ్లు నెత్తికి గుడ్డలు కట్టుకున్నారు. నేలమీది తట్టలు ఎడమకాలితో లేవదన్ని వంగకుండానే ఎడమ చేత్తో పట్టుకున్నారు. మగవాళ్లు గోచీ గుత్తంగా బిగించి మిగిలిన పంచె నడుముచుట్టూ చుట్టుకున్నారు. అయిపోతున్న చుట్టలు ఆశగా ఆఖరుసారి పీల్చుకున్నారు.

మెల్లగా తొందరలేని వేగంతో తవ్వు మళ్లీ ప్రారంభమయింది. ఎండ మరిచిపోడం కోసం సత్తిరెడ్డి పాట ప్రారంభించాడు:

ఎందుకోలె గుంటా! నా
ముందు నవ్వుతుంటా?
సెంపమీద సెమట తీసి
సేత జిమ్ముకుంటా?
సందటేల గుడిసికాడ
ఇంద రుండరే,
ఎందుకింత పట్టపగలు
తొందరపడతా వోలె?

ముసలయ్య పాటమీద పాట అందుకున్నాడు. మట్టిలో ఇసక పాలు తగిలింది. అంచేత గునపాలు పక్కనిపెట్టి పారలతో తవ్వు ప్రారంభించారు. రత్తి తట్టని వడుపుగా ఏటవాలుగా తన్నిపెట్టింది. సత్తిరెడ్డి పారతో మట్టి తవ్వి తట్టలోకి విసురుతున్నాడు. యాదాలాపంగా ఒక పార మట్టి రత్తి కాలిమీదకి సత్తిరెడ్డి విసిరాడు. ఆమె

తట్ట తన్నేసి వీదరగా కాళ్లు దులుపుకుంది. పకపక నవ్వింది. వేళా కోళంగా తిట్టింది. ముసలయ్య పాట ఆపి ఆవేపొకసారి చూశాడు.

పొద్దు వాలుతోంది. గాలి చల్లబడుతోంది. ఆఖరు కావచ్చిన తవ్వు అతి తొందరగా సాగుతోంది. మనసులో అమితమయిన విశ్రాంతి ఆవరిస్తోంది. కూలివాళ్ల ఏకాగ్రత భక్తిగా చూస్తో నేను గట్టుమీద కూర్చున్నాను. వాళ్ల తత్వాలని గురించి ఆలోచిస్తున్నాను. వాళ్లు పని చెయ్యాలంటే చేస్తారు. మనం ఎంత తొందర పెట్టినా వాళ్లు తొందరపడరు. వాళ్లకి కాలం అనేది లేదు. అయినా వాళ్లకీ ఒక అంచనా ఉంది. పని అయిపోతుందని వాళ్లకి తెలుసు. పని అయిపోతుంది కూడాను. అయినా వాళ్లు మనచేతుల్లో లేరు. మన అవసరాలన్నీ వాళ్ల చేతుల్లో కట్టుబడిపోయి ఉన్నాయి. పని వప్పగించిన తరవాత మనం వాళ్ల చెతుల్లో ఉంటాం. వాళ్ల యెడల మన అంచనాలు పనిచెయ్యవు. వాళ్లంతట వాళ్లు ఎంత చేస్తే అంతే.

చటుకుని ముసలయ్య కుడిచేత్తో ఒక తట్ట ఎత్తిరాక్షసిలాగ రత్తిమీదికి విసిరాడు. రత్తి ముఖంలోనూ కళ్లలోనూ భయం గంతులు వేసింది. తట్ట మళ్లీ ఎత్తినెత్తిమీద మొత్తాడు. ఆమె చేతులతో కాసుకుంది. ఆమె పైట రొమ్ముల మీదనించి కిందకి జారిపోయింది. ముక్కు వెంట కొద్దిగా నెత్తురు కారింది. అందరూ పని ఆపి ముసలయ్యను పట్టుకున్నారు. రత్తి నిస్సహాయంగా "అమ్మయ్యో !" అంటూ గాబరా ఎత్తిపోయి ఏడిచింది.

"గుడిశేటి నెంజా !" ముసలయ్య ఒకటేమాట అనగలిగాడు. అతని ముఖం, శరీరం, ఆవేశంతో వశంతప్పి ఉన్నాయి. పద్దాలు సముదాయించబోతో అన్నాడు :

"ఏటయ్యా ఆ యిసురు ! కుర్రగుంటని."

నేను సంగతేమిటని అడిగాను. ముసలయ్య కోపంతో వాణికి పోతూ అన్నాడు.

"నరసాలాడతంది. నెంజ."

"నేదండి బాబో! నేనేమెరగనండి" అని దీనంగా కంగారుగా ఏడుస్తో అందిరత్తి.

"ఏ! నోరుముయ్యి నెంజికానా? వొల్లొలిచేత్తాను."

మునలయ్యా మళ్ళీ విజృంభించబోయాడు. తక్కినవాళ్ళు పట్టుకున్నారు. సత్తిరెడ్డి బలంగా అతన్ని నొక్కిపట్టుకుని అన్నాడు:

"ఏటబ్బా! ఆ యిసురు? కూంత పరాసకాలాడితేనే అంత కోపమా? పొరుచ్చుకో, పొరుచ్చుకో, సందలడిపోతంది. రండల్లా రండి."

అంతా మళ్లీ పని ప్రారంభించారు. నా గుండెల్లో అదుటు పోలేదు. ఆమెను మునలయ్యా తరవాత ఏం చేస్తాడో!

గట్టు పూర్తి అయేసరికి పొద్దు కుంకింది. వెన్నెలకూడా వెచ్చగానే ఉంది. గిన్నెల్లో మిగిలిన అన్నాలు మళ్లీ వాళ్లంతా తిన్నారు. నేను అనుమానంగా భయంగా రత్తివేపు చూశాను. మునలయ్యావేపు చూశాను. కూలీలలో ఒకడు వచ్చి కొంత డబ్బు కావాలన్నాడు నేను ఇచ్చాను. మిగతా డబ్బు మరునాడు లెక్కచూసి ఇస్తానన్నాను.

కరణంగారి ఇంట్లో నేను భోజనం చేశాను. వారిచ్చిన మంచం అరుగుపక్కని కాళీస్థలంలో వాల్చుకుని పడుకున్నాను. నడినెత్తిని చంద్రుడు నీలంగా వెన్నెల కాస్తున్నాడు. గాలి కొంత కొంత చల్లబడుతోంది. కూలీలంతా ఎక్కడికో పోయారు. నేను మునలయ్యానీ రత్తినీ గురించి తలుచుకుంటో పడుకున్నాను. మునలయ్యా ముఖంలో నాగరకతకు లొంగని పశుత్వం చూశాను. అది నా మనస్సులో ముద్రవేసినట్టు నాటుకుంది. రత్తి ముఖంలో అసహాయతా, దైన్యమూ చూశాను. ఏదో ప్రళయం విరుచుకు పడుతుందన్నంత భయం నాలో నిండిపోయింది.

కూలీలు గొడవగా వచ్చారు - ఆడ, మగ, ఒకరినొకరు తోసుకుంటూ, తిట్టుకుంటూ, నవ్వుకుంటూ. వాళ్లు తాగివచ్చారని గ్రహించాను. కాలువగట్టు మీద అల్లరి బిల్లరగా పడిపోయారు

వాళ్ళు. కొందరు తవ్వినకాలవలో తలగుడ్డలు పరచుకుని పడుకున్నారు. ముసలయ్య తప్ప తాగాడు. రత్తి బాగా తాగింది. ఇద్దరూ తూలిపోతూ చింతచెట్టు మొదట్లో కూలబడ్డారు. కొంచెం దూరంలో సత్తిరెడ్డి పచ్చికమీద దొర్లుతున్నాడు. పాడుతున్నాడు.

సింతకొమ్మ మీద సిరిబొమ్మ ఆడింది -
పుంతలో ముసలమ్మ పురిటికెల్లిందే,
పురిటికెల్లిందే -

"పురిటికెల్లిందే" అంతా అందుకుని పాడారు. తాగిన నోళ్ళలో మాటలు తడబడ్డాయి. అపస్వరాలతో పాట చిత్రంగా ఉంది.

పోతరాజుకి రెండు పోతుల్ని బలియేసి
పొరుగూరు పోదాం - రండోలె,
—రండోలె.

చటుకుని ముసలయ్య అందుకున్నాడు.

సేతుల్ని పైకెత్తి యేతమెత్తేకాడ
కుర్రదానికి రైక పుర్రుమన్నాదే
—పుర్రుమన్నాదే.

అక్కడినించి పాట దారీతెన్నూ లేకుండా నడిచింది. ఎవరి నోటి కొచ్చింది వాళ్ళు పాడారు. క్రమంగా గొంతుకలు సన్నగిల్లాయి. పాటలు ఆగిపోయాయి. నిద్రమత్తు ఆవరించింది.

నాకు కొంత మసగ్గా నిద్రపడుతోంది. కాని చల్లబడుతున్న వెన్నెల స్పర్శ నాకింకా గుర్తుఉంది. చటుకుని ఎవరో నాపక్కనించి నడిచివెళ్ళినట్టు అనిపించింది. కళ్ళు విప్పి కదలకుండా చూశాను. నాకు పదిగజాల దూరంలో రెండుమూర్తులు ఒకళ్ళ మీద ఒకళ్ళు తూలుతో ఆనుకుంటో వెడుతున్నారు. ఒకడు ముసలయ్య, రెండవది రత్తి. ముసలయ్య రహస్యంగా మెల్లగా అన్నాడు:

"ఈ యరుగుమీద తొంగుందాం"

"ఈ యెన్నిట్లోనే?" అంది మత్తుగా రత్తి.

"నడేశే." మునలయ్య ఆమె నడుమును రెండు చేతులతోటీ పట్టుకున్నాడు. ఆమె నవ్వుతూ వెనక్కి అతని మీదికి వంగింది. అతను మెల్లగా ఆమెను అరుగుమీదికి చేర్చాడు. నేను వింతగా ఆశ్చర్యంగా చూస్తో కదలకుండా పడుకున్నాను. ఇందాకటి కోపం, ఈసు అన్నీ ఏమయినాయి ? నాకర్థం కాలేదు. కాని నామనస్సులో మితిలేని సంతృప్తి, ప్రశాంతి నిండుకున్నాయి. లోకం ఉండవలసినట్టుగానే ఉంది. నడవవలసిన మార్గాన్నే నడుస్తోంది. నాకర్థం కాకపోతే నష్టమేముంది ? నాకు క్రమంగా నిద్రపట్టింది.

ఏదో కలకలంతో నాకు మెలకువ వచ్చింది. మంచం మీద కళ్లు నులుపుకుంటూ లేచి కూర్చున్నాను. కూలీలు హడావిడిగా తట్టలూ పారలూ గట్టుని పడేస్తున్నారు. కాలవలో అడుగుని సన్నగా నీటి తడి కనబడుతోంది. మనస్సు నిండినట్టు అనిపించింది. చంద్రుడు అప్పుడే అస్తమించాడు. కూలీలు మళ్ళీ నిద్రలో మునిగిపోయారు. అరుగుమీద చీకట్లో నాకేమీ కనబడలేదు. కాని నాకు మాత్రం ఆ రాత్రి ఇంక నిద్రపట్టలేదు.